హైకోర్టు తాత్కాలిక సిజెగా జస్టిస్ సుజయ్‌పాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధానన్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్‌ను రాష్ట్రపతి నియమించారు. రాష్ట్ర ఉన్నతన్యాయస్థానం సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజయ్‌పాల్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే బాంబే హైకోర్టు సీజేగా బదిలీపై వెళ్లిన విషయం విదితమే. 1964 జూన్ 21న జస్టిస్ సుజయ్‌పాల్, బీకాం, ఎంఎ, ఎల్‌ఎల్‌బీ పూర్తిచేసి 1990లో మధ్యప్రదేశ్ బార్‌కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. పలు బ్యాంకులు, మానవ హక్కుల కమిషన్, బోర్డులకు సేవలు అందించారు. అనంతరం ఆయన 2011 మే 27న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2014 ఏప్రిల్ 14న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుతో 2024 మార్చి 21న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీపై వచ్చారు. సోమవారం ఆయన్ను తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా నియమించారు.

లీగల్ ఒపీనియన్ మేరకే కేసు ఉపసంహరణ

- కెటిఆర్ అడ్వకేట్ మోహిత్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

న్యాయ సలహా మేరకు కేసును ఉపసంహరించుకున్నట్టు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ అడ్వకేట్ మోహిత్ రావు తెలిపారు. సుప్రీంకోర్టులో కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్ డిస్మిస్ కాలేదని స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏ కోర్టులోనైనా అప్పీల్ చేసుకునేందుకు తమకు అవకాశముందని వివరించారు. అంతకుముందు ఫార్ములా ఈ కార్ కేసులో సుప్రీం కోర్టులో కెటిఆర్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ ప్రసన్న వర్లే ధర్మాసనం విచారణ జరిపింది. కెటిఆర్ క్వాష్ పిటిషన్ పై ఆర్యమా సుందరం, సిద్ధార్థ దవేలు వాదనలు వినిపించారు. ఈ కేసులో సెక్షన్ 13.1ఏ పిసి యాక్ట్ వర్తించదని వాదనలు వినిపించినట్టు మోహిత్ రావు తెలిపారు. ఏసీబీ ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్న అంశాలు ప్రొసీజర్‌లో ఉన్న ఇర్రెగ్యులారిటీకి సంబంధించిన అంశాలని చెప్పారు.

పసుపు బోర్డు వల్ల రైతులకు ఎంతో మేలు

- చిన్నారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయడం హర్షణీయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి పేర్కొన్నారు. నాణ్యమైన విత్తనాల సరఫరా, ధరల స్థిరీకరణ, మార్కెటింగ్, కొత్త వంగడాల రూపకల్పన, రైతులకు ఉప ఉత్పత్తులకు అవకాశం తదితర అంశాల బాధ్యత బోర్డుకు ఉంటుందని ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

రైతు కూలీలందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలి

- ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని రైతు కూలీలందరికీ అమలు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. వర్చువల్‌గా బుధవారం నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలో పాల్గొన్న హరీశ్‌రావు మంత్రి కొండ సురేఖతో మాట్లాడారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు విధించకుండా అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీ చట్టంలో ఈ ఏడాది కనీసం 20 రోజులు పని దినాలు ఉంటేనే కూలిగా గుర్తింపు అనే నిబంధన సరైనది కాదన్నారు. అనారోగ్య సమస్యలు, ఇతర ఏవైనా సమస్యలతో పనికి వెళ్లని కూలీలను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించకుంటే ఎలా అని, ఈ నిర్ణయాన్ని కూడా మార్చి, రైతు కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఇల్లు మంజూరై కొంత నిర్మాణం చేసుకున్నారని, అలాంటి ఇండ్లను పూర్తి చేసుకోవడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఈ-బస్సులతో ఆర్‌టిసికి ముప్పు

- కేంద్ర ప్రభుత్వ భారీ సబ్సిడీ ప్రయివేటు సంస్థలకు మాత్రమే..
- డ్రైవర్లు, మెకానిక్‌ల పరిస్థితి అగమ్యగోచరం..
- ఆర్‌టిసిలో 2030 నాటికి పూర్తిగా ఈ-బస్సులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ బస్సులను (ఈ-బస్సులు) ఆర్‌టిసిలో ప్రవేశపెట్టడం వల్ల ఆర్‌టిసి ప్రయివేటు సంస్థగా మారే ప్రమాదముందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పటికే కాలుష్య నివారణ పేరుతో ఈ-డ్రైవ్ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా ఈ-బస్సులను రంగంలోకి దించింది. డీజిల్ బస్సుల వల్ల శబ్ద కాలుష్యంతో పాటు వాయుకాలుష్యం అధికమవుతుందని, దీన్ని నివారించడంలో భాగంగానే ఈ-బస్సులను ప్రవేశపెడుతున్నట్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధాన పత్రంలో పేర్కొన్నాయి. ఇది చదవడానికి, చూడడానికి బాగానే ఉన్నా, ఈ-బస్సుల తయారీ, ఆపరేటింగ్ చేయడం వంటి వాటిని ప్రయివేటు కంపెనీలకు కేంద్రం అప్పగించడంతో పాటు వాటికే భారీగానే సబ్సిడీలను ఇస్తోంది.ఇది ప్రభుత్వ రంగంలోని ఆర్‌టిసి వంటి సంస్థలకు కాకుండా, ప్రయివేటు సంస్థలకు ఇవ్వడమంటే ప్రయివేటీకరణను ప్రోత్సహించడమేనన్నది అర్థమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఆర్‌టిసి వంటి సంస్థలను ప్రయివేటుపరం చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యంగా కనిపిస్తోందని ఆర్‌టిసి ఉద్యోగ సంఘాలు అంటున్నాయి.



ఆర్‌టిసిలో ఒక్క బస్సుకు ఆరుగురు సిబ్బంది అవసరం. 1:6 నిష్పత్తిలో నియామకాలు చేపట్టేవారు. విద్యుత్ బస్సులు రంగ ప్రవేశం చేస్తే ఈ నియామకాలు పూర్తిగా నిలిపివేసే అవకాశముంది. విద్యుత్ బస్సుల రంగ ప్రవేశంతో 1:1 సిబ్బంది మాత్రమే ఉండే అవకాశముంది. ఈ-బస్సులకు 1 కిలోవాట్‌కు రూ.10 వేల సబ్సిడీని కేంద్రం ఇస్తుంది. ఇదే సబ్సిడీని ప్రభుత్వరంగంలోని ఆర్‌టిసి కార్పొరేషన్‌లకు ఇస్తే ఎంతో లాభదాయకంగా ఉండేదని కార్మికులు అంటున్నారు. 2030 నాటికి రాష్ట్రంలో 9,300 డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులను నడపడానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలో ఇప్పటికే 190 విద్యుత్ బస్సులు తిరుగుతున్నాయి. హైదరాబాద్‌లోనే 115 విద్యుత్ బస్సులు తిరుగుతున్నాయి. ఈ ఏడాది హైదరాబాద్‌లో 1000 విద్యుత్ బస్సులు, 2026 నాటికి మొత్తం 2,800 విద్యుత్ బస్సులు తీసుకురావడానికి రంగం సిద్ధమైంది.

ఉద్యోగ భద్రతకు తిలోదకాలు

ఈ-బస్సుల తయారీ, ఆపరేటింగ్ విధానాన్ని కేంద్రం, ప్రయివేటు కంపెనీలకు అప్పగించడం వల్ల ఆర్‌టిసిలో కార్మికులకు ఉద్యోగభద్రత కరువు కానుంది. ఈ-బస్సులను సంబంధించిన ప్రయివేటు కంపెనీకి చెందిన డ్రైవర్లు మాత్రమే నడుపుతారు. ఆ వాహనాలకు సంబంధించిన మెయింటెనెన్స్ మొత్తం ఆ కంపెనీ మెకానిక్‌లే, సిబ్బంది మాత్రమే పర్యవేక్షించనున్నారు. దాంతో ఆర్‌టిసిలో ఉన్న డ్రైవర్లు, మెకానిక్‌లను మిగులు సిబ్బందిగా చూపనున్నారు. ఇదే జరిగితే వారు ఉద్యోగాలను కోల్పోయే ప్రమాదముంది.

విద్యుత్ బస్సులను ఆర్‌టిసి డ్రైవర్లే ఆపరేట్ చేయాలి..

విద్యుత్ బస్సులను ప్రయివేటు కంపెనీ డ్రైవర్లు కాకుండా ఆర్‌టిసి డ్రైవర్లే ఆపరేట్ చేయాలి. ప్రయివేటు కంపెనీలే ఈ విద్యుత్ బస్సులను నడపడం వల్ల డ్రైవర్లు, మెకానిక్‌ల ఉద్యోగ భద్రతకు ప్రమాదం ఏర్పడుతుంది. విద్యుత్ బస్సులను నడపడం వల్ల ఆర్‌టిసిని ప్రయివేటు సంస్థగా మారే ప్రమాదముంది. అదే జరిగితే ఇటు కార్మికులు, అటు ప్రజలు తీవ్ర భారం భరించాల్సి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను ఆర్‌టిసికి ఇస్తే కార్మికులకు, సంస్థకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణను వేగవంతం చేయడంలో భాగంగానే ఆర్‌టిసిని నిర్వీర్యం చేయాలని చూస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసిలో పెట్టుబడులు పెట్టకుండా తప్పుకోవడంలో భాగంగానే కేంద్రం ఇచ్చే సబ్సిడీలకు ఆశపడి ప్రయివేటు కంపెనీలకు చెందిన విద్యుత్ బస్సులను రాష్ట్రంలో నడుపుతుంది. దాంతో డ్రైవర్లు, మెకానిక్‌ల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లనుంది. ఇప్పటికే ఆర్‌టిసిలో సిబ్బంది సర్దుబాటు ప్రక్రియనూ ప్రారంభించారు.

- రాంచందర్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, అధ్యక్షులు, వరంగల్ రీజియన్

రెండు దశాబ్దాల పోరాటం ఫలించింది

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పసుపు బోర్డు ఏర్పాటు కోసం రెండు దశాబ్దాల రైతుల పోరాటం ఫలించిందని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి, తెలంగాణ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉందని గుర్తు చేశారు. బుధవారం హైదరబాద్‌లోని గాంధీభవన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. 2022లో కేంద్రం పసుపు బోరు ఏర్పాటు చేస్తామంటూ బిజెపి చెప్పిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా పసుపు బోర్డు ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా పసుపు బోర్డు రాష్ట్రానికి ఇవ్వాలని కోరామని తెలిపారు. మార్కెటింగ్ వ్యవస్థ, గోడౌన్, కోల్డ్ స్టోరేజ్, పసుపు మద్దతు ధర కల్పించాలని కోరారు. చక్కర కర్మాగారం కూడా పున:ప్రారంభం చేయాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డుతో సాగు విస్తీర్ణం పెరుగుతున్నదని చెప్పారు. పసుపు బోర్డు చైర్మెన్‌గా నిజామాబాద్ జిల్లాలకు వ్యక్తిని నియమించడం మంచి పరిణామమని తెలిపారు.

పసుపు బోర్డుకు ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. దానికి ప్రత్యేకంగా నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పసుపుబోర్డు ఏర్పాటు కోసం కేంద్రానికి లేఖ రాసినట్టు గుర్తు చేశారు. అయినా మంగళవారం జరిగిన పసుపు బోర్డు కార్యక్రమన్ని బిజెపి కార్యక్రమంగా చేసిందని విమర్శించారు.

రిటర్న్ జర్నీ రష్..

- టోల్‌ప్లాజాల వద్ద వాహనాల బారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సొంతూళ్లకు వెళ్లిన హైదరాబాద్ వాసులు బుధవారం తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న వాహనాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. యాదాద్రి జిల్లా పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్దకు భారీగా వాహనాలు చేరుకున్నాయి. పంతంగి టోల్‌ప్లాజాలోని 12 టోల్‌బూత్‌ల ద్వారా ఎపి నుంచి తెలంగాణ వైపు వాహనాలను అనుమతిస్తున్నారు. బుధవారం రాత్రి 10గంటల సమయంలో కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ నెమ్మదించింది.

తెలంగాణ ఇన్‌సర్వీస్ వైద్యులకు సుప్రీంకోర్టులో ఊరట

- మంత్రి దామోదర రాజనర్సింహకు ధన్యవాదాలు
- తెలంగాణ పిజి ఇన్‌సర్వీస్ వైద్యులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ స్థానికత కలిగి గతంలో తెలంగాణ రాష్ట్రం బయట ఎంబిబిఎస్ పూర్తి చేసిన ఇన్‌సర్వీస్ వైద్యులకు పిజి వైద్య విద్య అడ్మిషన్లలో అవకాశం దక్కేలా సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వానికి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు తెలంగాణ పిజి ఇన్‌సర్వీస్ వైద్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు బుధవారం నాయకులు డాక్టర్ కత్తి జనార్ధన్ తదితరులు ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ అభ్యర్థుల తరపున ప్రత్యేక చొరవ తీసుకున్నారని గుర్తుచేశారు. అడ్మిషన్లలో అవకాశం కల్పించాలని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం ఊరట కలిగించిందని తెలిపారు. సుప్రీంకోర్టులో ఇన్ సర్వీస్ వైద్యుల తరపున అడ్వొకేట్ శ్రీరాం వాదనలు వినిపించినట్టు తెలిపారు. తెలంగాణ స్థానికత కలిగి గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంబిబిఎస్ మాత్రమే తెలంగాణ బయట పూర్తి చేసి తిరిగి సొంత రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా కాంట్రాక్ట్ వైద్యులుగా సేవలందిస్తున్నారని తెలిపారన్నారు. దాదాపు ఆరు నుంచి పదేళ్ల పాటు తెలంగాణ ప్రజలకు సేవలందిస్తున్న వారికి ఇన్‌సర్వీస్‌లో పిజి చేసే అర్హత ఉందంటూ వాదించారని చెప్పారు. వాదనల అనంతరం రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదాలు శంకర్ నారాయణ, శ్రవణ్ కుమార్‌లకు సుప్రీంకోర్టు ఇన్ సర్వీస్ డాక్టర్లకు పిజి అడ్మిషన్లలో అవకాశం కల్పించాలని సూచనలు చేసిందని తెలిపారు. ఇందుకు ఆ లాయర్లు కూడా సుముఖత వ్యక్తం చేసి ఒప్పుకున్నారని పేర్కొన్నారు.

ఆల్ప్రాజోలం డ్రగ్ తయారీ ముఠా గుటురట్టు

- సుమారు రూ.60 కోట్ల విలువైన ఆల్ప్రాజోలం పట్టివేత
- పోలీసుల అదుపులో నిందితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిషేధిత ఆల్ప్రాజోలం డ్రగ్ తయారీ ముఠా గుట్టు రట్టు చేసి, వారి వద్ద నుంచి దాదాపు రూ.60 కోట్ల విలువ చేసే ఆల్ప్రాజోలంను స్వాధీం చేసుకున్నామని జిల్లా ఎస్‌పి చెన్నూరి రూపేష్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ మేరకు వివరాలను ఎస్‌పి శనివారం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు.. ముత్తంగి గ్రామానికి చెందిన పాత నేరస్తుడు సుధీర్‌గౌడ్ తన కారులో ముత్తంగి నుంచి మెదక్‌కు వెళ్తుండగా ముంబాపూర్ గేట్ వద్ద పోలీసులు అతని కారును ఆపి తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతం కూడా అల్ప్రాజోలంను అమ్ముటానికి మెదక్ వెళు తున్నట్టు అతను ఒప్పుకోవడంతోపాటు అతని కారులో రూ.60 కోట్ల విలువ గల ఆల్ప్రాజోలం పట్టుబడిందని ఎస్‌పి తెలిపారు.

జీవనోపాధి కోసం బీరంగూడలో నివాసం ఉంటూ, తెలికగా డబ్బు సంపాదించాలనే దురాశతో 2014లో సుధీర్ గౌడ్ అతని భార్య శ్రీవాణి, అతని తమ్ముడు ప్రభుగౌడ్ కమిషన్‌కు కల్లులో కలిపే నిషేధిత అల్ప్రాజోలం మత్తు మందును అమ్మేవారు. ఆ అనుభవంతో 2017లో కానుకుంటకు చెందిన విశాల్ గౌడ్ అనే వ్యక్తిని పరిచయం చేసుకుని అతని నుంచి అల్ప్రాజోలం తీసుకొని అమ్మేవారు. 2020లో గుమ్మడిదలకు చెందిన సాయిగౌడ్ అనే వ్యక్తిని పరిచయం చేసుకుని అతని నుంచి అల్ప్రాజోలం కొని అమ్మేవాళ్లు. కమిషన్ ద్వారా వచ్చే డబ్బులు సరిపోక, వ్యాపారంలో అధిక లాభాలను చూసి సొంతంగా వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇదే సమయంలో విశాల్ గౌడ్.. ముత్తంగికి చెందిన బీశ్వేశ్వర్ సింగ్‌ను పరిచయం చేయగా, అప్పటి నుంచి వీరందరూ కలిసి ఈ నిషేధిత అల్ప్రాజోలం వ్యాపారం చేస్తున్నారు. బీశ్వేశ్వర్ సింగ్‌కు అల్ప్రాజోలంను తయారు చేసే పద్ధతి తెలియడంతో అప్పటి నుంచి దాన్ని తయారు చేసి విక్రయించేవారు. అలా విక్రయించేందుకు మెదక్ వెళుతుండగా సుధీర్‌గౌడ్ సరుకుతో పాటు పట్టుబడ్డాడు. అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్న పటాన్‌చెరు డిఎస్‌పి రవీందర్ రెడ్డి, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్, జిన్నారం ఇన్‌స్పెక్టర్ నయీముద్దీన్, గుమ్మడిదల ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

గుడుంబా నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్

- 13 జిల్లాల్లోని 25 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో అమలు
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నాటుసారా తయారీ నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తునట్టు తెలంగాణ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి.కమలాసన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు 13 జిల్లాల్లోని 25 ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలో చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. నాటుసారా తయారీ మండలాలుగా గుర్తించిన ప్రాంతాల్లో దాడులు నిర్వహించడానికి ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసుకోవాలని ఎక్సైజ్ ఉన్నతాధికారులకు సర్క్యులర్లు జారీ చేశామని తెలిపారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలతో పాటు ముడిసరుకు అక్రమ రవాణా, బెల్లం, అలంను సరపరా చేసే నిందితుల సమాచారాన్ని సేకరించాలని సంబంధిత జిల్లాల అబ్కారీ శాఖ అధికారుకు సూచించినట్టు తెలిపారు. నాటుసారా ప్రభావిత స్టేషన్ల సిఐలు, ఇన్‌చార్జీలతోపాటు డీటీఎస్ , ఎస్‌టీఎఫ్ టీమ్‌ల సహకారంతో పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకుటంటున్నట్టు వివరించారు. దాడుల పర్యవేక్షణను డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, ఎఇఎస్‌లు, సిఐలు పర్యవేక్షణలో జరుగనుందని తెలిపారు.

జిల్లాలలో గుర్తించిన ప్రాంతాలు

మంచిర్యాల జిల్లాలో చెన్నూర్, లక్షెట్టిపేట, బెల్లంపల్లి, వనపర్తి జిల్లాలో వనపర్తి, కొత్తకోట, నాగర్‌కర్నూల్ జి ల్లాలో అచ్చంపేట, తెలకపల్లి, కల్వకుర్తి, వరంగల్ రూరల్ జిల్లాలో పరకాల, నర్సంపేట, వర్ధన్నపేట, మహబూబాబాద్ జిల్లాలో తొర్రూర్, మహబూబాబాద్ జిల్లా గూడేరు, భూపాల్‌పల్లి జిల్లాలో ములుగు, కాటారం, భూపాల్‌పల్లి, నల్లగొండ జిల్లాలో దేవరకొండ, కొత్తగూడెం జిల్లాలో భద్రాచలంను గుర్తించామన్నారు మహబూబ్‌నగర్, పెద్దపల్లిలో సుల్తానాబాద్, జగిత్యాలలో ధర్మపురి, నిర్మల్ ప్రాంతాలను నాటు సారా ప్రభావిత ప్రాంతాలుగా అంచనా వేసినట్టు తెలిపారు. గుర్తించిన ప్రాంతాల్లో, ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు నాటుసారా అరికట్టడం దిశగా ప్రత్యేక దాడులు కొనసాగుతాయని వివరించారు.

జైపాల్‌రెడ్డికి సిఎం నివాళులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ యోధుడు, ఉత్తమ పార్లమెంటేరియన్, కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి జయంతి నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాకారంలో జైపాల్‌రెడ్డి పోషించిన పాత్ర ప్రజలెప్పుడూ మరిచిపోరని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, ప్రజల మనోభావాలని కేంద్రానికి వివరించి సఫలీకృతుడైన నాయకుడు జైపాల్‌రెడ్డి అని అభిప్రాయపడ్డారు. తెలంగాణ సాధన కోసం నిశ్శబ్ద సైనికుడిలా జైపాల్‌రెడ్డి పనిచేశారన్నారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో సమన్వయం చేసి అత్యంత కీలకపాత్ర పోషించిన మట్టిబిడ్డ అని కొనియాడారు. తెలంగాణ పల్లె నుంచి ఢిల్లీ దాకా ఎదిగిన జైపాల్ రెడ్డి దేశంలో అరుదైన రాజకీయవేత్త అని ప్రశంసించారు. రాజకీయాల్లో నిష్కళంక నేతగా, విలువలకు ప్రతీకగా ఆయన నిలిచారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుడిగా లోక్‌సభ సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, విపక్ష నేతగా, కేంద్ర మంత్రిగా నిర్వహించిన అనేక పదవులకు జైపాల్ రెడ్డి వన్నె తెచ్చారని అన్నారు. యునైటెడ్ ఫ్రంట్ కామన్ మినిమం ప్రోగ్రామ్ (సిఎంపి)ని రూపొందించడం ద్వారా దేశ ప్రాధాన్యాలను గుర్తించిన నాయకుడని శ్లాఘించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఆ ప్రాంతానికి నీరివ్వాలని మొట్టమొదట తలచిన నాయకుడు జైపాల్‌రెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేయడానికి జైపాల్‌రెడ్డి పునాదులు వేశారని చెప్పారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జైపాల్‌రెడ్డి పేరును ఖరారు చేస్తూ ఇటీవల మంత్రిమండలి తీర్మానించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే హైదరాబాద్ మెట్రో రైలు మంజూరైందన్నారు. విలువలతో జీవితాంతం ప్రజాసేవకే అంకితమైన జైపాల్‌రెడ్డి జయంతిని గురువారం అధికారికంగా నిర్వహిస్తున్న ఈ తరుణంలో వారి ఆశయాలు, ఆకాంక్షలను ముందుకు తీసుకుపోవడంలో ప్రతిఒక్కరూ పాటుపడాలని సిఎం కోరారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న పాలడుగు భాస్కర్ తదితరులు

ఎంవి యాక్ట్‌తో రవాణా రంగం కుదేలు

- లేబర్ కోడ్ల వ్యతిరేక పోరాటంలో టాన్స్‌పోర్ట్ కార్మికులు కలిసి రావాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కంద్రంలోని మోడీ సర్కార్ తీసుకొచ్చిన మోటారు వాహనాల చట్టం (ఎంవి యాక్ట్)తో రవాణారంగం పూర్తిగా కుదేలైందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ విమర్శించారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టివిఎఫ్) రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం హైదరాబాద్‌లోని సిఐటియు నగర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధికోసం గూడ్స్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను నమ్ముకున్న సామాన్య ప్రజలకు ఈ చట్టం గుదిబండగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పదేళ్ల కాలంలో తీసుకొచ్చిన అనేక సంస్కరణలు ప్రజల జీవితాలను కకావికలం చేశాయని విమర్శించారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిన మోడీ సర్కార్ వాటిని ఫిబ్రవరిని నుంచి అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్‌కోడ్‌ల అమలుకు వ్యతిరేకంగా ఫిబ్రవరి ఐదున దేశవ్యాప్త నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వం వాటిని ఉపసంహరించుకోకుంటే సార్వత్రిక సమ్మెకు సన్నద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మికుల న్యాయమైన హక్కుల కోసం చేస్తున్న పోరాటంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం వెంకటేశ్, ఎఐఆర్‌టివిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి శ్రీకాంత్, నగర కార్యదర్శి కె అజయ్‌బాబు, నాయకులు వి కామేశ్‌బాబు, బి లక్ష్మన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మరో ఏడాది పొడిగింపు కుదరదు

- ఫైర్ సేఫ్టీ ఎన్ఒసి సమర్పించాల్సిందే
- జూనియర్ కాలేజీలకు హోంశాఖ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫైర్ సేఫ్టీకి సంబంధించి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఒసి) సమర్పించాలని, అప్పటివరకు తాత్కాలిక ఏర్పాట్లను చేసుకోవాలని జూనియర్ కాలేజీలను హోంశాఖ ఆదేశించింది. ఈ మేరకు బుధవారం హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. జూనియర్ కాలేజీల్లో ఫైర్ సేఫ్టీకి సంబంధించి ఎన్ఒసికి సంబంధించిన ప్రొసీజర్లను 2020లోనే హోంశాఖ ఉత్తర్వులిచ్చిందని గుర్తుచేశారు. అయితే ప్రత్యేక కేసుగా గుర్తించి 2021-22 వరకు, తిరిగి 2022-23, 2023-24లో రెండేండ్ల పాటు పొడిగించిందని గుర్తుచేశారు. 2024లో తెలంగాణ ప్రయివేటు జూనియర్ కాలేజీల యాజమాన్యాల సంఘం ప్రత్యేక కేసుగా మరో రెండేళ్ల పొడిగింపునివ్వాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. అన్ని ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం, తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ జనరల్, తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కార్యదర్శి సంప్రదించి 2024-25 ఒకే ఏడాదికి మాత్రమే మినహాయింపునివ్వాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. మరో ఏడాది పొడిగించేది లేదని స్పష్టం చేశారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు తరగతి గదుల్లో అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకుని తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సంబంధించి ఫోటోలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు సంబంధిత కళాశాలలు అఫిడవిట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

- సిఎస్ శాంతికుమారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న నాలుగు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహించే గ్రామసభల్లో ఆమోదం పొందాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఈ నెల 26వ తేదీన ప్రారంభించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు తగిన కార్యాచరణ చేపట్టేందుకు జిల్లా కలెక్టర్లతో సీఎస్ బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా సిఎస్ శాంతికుమారి మాట్లాడుతూ ఈ నాలుగు ప్రతిష్టాత్మక పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఏవిధమైన అపోహలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఈ పథకాలన్నీ నిజమైన అర్హులకే దక్కేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతు భరోసాకు సంబంధించి భూముల వివరాలను రెవెన్యూ శాఖ ద్వారా వ్యవసాయ శాఖకు పంపడం జరిగిందన్నారు. సాగుయోగ్యం కాని భూములను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలన్నారు. గ్రామసభల్లో వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలు స్పష్టంగా చెప్పాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకుగాను ఉపాధిహామీ పథకంలో కనీసం 20 రోజులు పనిచేసిన భూమిలేని వ్యవసాయ కార్మికుల కుటుంబాల జాబితాను గ్రామసభల్లో ప్రకటించి ఆమోదం పొందాలని సిఎస్ తెలిపారు. రేషన్‌కార్డుల మంజూరీకై రూపొందించిన లబ్ధిదారుల ముసాయిదా జాబితా గ్రామసభల్లో ఆమోదం పొందాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శక సూత్రాల ఆదేశాలకు అనుగుణంగా లబ్ధిదారుల ముసాయిదా జాబితాను గ్రామాలలో ప్రదర్శించాలని చెప్పారు. గామీణ ప్రాంతాలలో, గ్రామపంచాయతీల వారిగా, పట్టణ ప్రాంతాల్లో వార్డుల వారిగా సభలు నిర్వహించాలని వివరించారు. జిహెచ్‌ఎంసి పరిధిలో లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా నేపథ్యంలో లబ్ధిదారుల జాబితా ఎంపిక, డాటా ఎంట్రీ, క్షేత్ర స్థాయి పరిశీలన తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిహెచ్‌ఎంసి కమీషనర్‌ను ఆదేశించారు. ఇప్పటివరకు, ఈ నాలుగు పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన, ప్రత్యేక బృందాల ఏర్పాటు, ముసాయిదా జాబితా తయారీ, డేటా ఎంట్రీ ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు చేసిన ప్రత్యేక కృషిని సిఎస్ అభినందించారు. ఈ నాలుగు పథకాల అమలుకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను సంబంధిత కార్యదర్శులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డిఎస్ చౌహాన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి బుద్ధప్రకాష్, పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్‌తోపాటు రాష్ట్రంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జీహెచ్‌ఎంసి కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కెటిఆర్‌ను విచారించనున్న ఇడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌లో భారీ ఎత్తున నిధుల మళ్లింపునకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు గురువారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్‌ను విచారించనున్నారు. దీనికి సంబంధించి విచారణకు హాజరు కావాలని కేటీఆర్‌కు ఇప్పటికే ఇడి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా, ఈ కేసును కొట్టివేయాలంటూ కెటిఆర్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం న్యాయమూర్తులు తోసిపుచ్చటంతో ఇది మరో మలుపు తిరిగినట్టయ్యింది. ఇప్పటికే ఎసిబి అధికారులు కెటిఆర్‌ను విచారించారు. అంతేగాక, సుప్రీం కోర్టులో క్వాష్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ ఎసిబి సైతం రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదితో కలిసి చేసిన వాదనకు అక్కడ బలం చేకూరినట్టయ్యింది. అదేసమయంలో, ఏసీబీ సైతం కెటిఆర్‌ను విచారించటానికి మరోమారు రంగం సిద్ధం చేసుకుంటున్నది. ఈ నేపథ్యంలో తాజాగా ఈడీ కెటిఆర్‌ను విచారిస్తున్న సందర్భంలో ఎలాంటి విషయాలు ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి వెలుగు చూస్తాయోనన్న ఆసక్తి సర్వత్రా ఏర్పడింది. ముఖ్యంగా, రూ.46 కోట్ల మేరకు హెచ్‌ఎండిఎ నుంచి ఈ-కార్ రేస్ నిర్వహణకు సంబంధించి లండన్‌కు చెందిన ఎఫ్ఇఒ కంపెనీకి బదిలీ చేసే సమయంలో వాటిని పౌండ్ల రూపంలో మార్చినపుడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నుంచి ఎలాంటి అనుమతీ తీసుకోకపోవటంపై ఇడి ప్రత్యేకంగా దృష్టిని సారించనున్నట్టు తెలిసింది. ఈ కారణం చేత ఆర్బీఐ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.8 కోట్ల జరిమానాను విధించటం పైనా కెటిఆర్‌ను ఇడి ప్రశ్నించనున్నట్టు సమాచారం. అలాగే, ఇప్పటికే ఈ కేసులో రెండో, మూడో నిందితులైన సీనియర్ ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్, చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డిలను ఇడి ప్రశ్నించింది. వారిచ్చిన సమాచారాన్నీ ఆధారంగా చేసుకొని కెటిఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించే అవకాశముందని తెలిసింది. మొత్తమ్మీద, కెటిఆర్‌కు ఇడి నుంచి కొన్ని కఠినమైన ప్రశ్నలే ఎదురు కానున్నాయని సమాచారం. కాగా, కెటిఆర్‌ను ఇడి ప్రశ్నించనున్న నేపథ్యంలో, విచారణ సంస్థ కార్యాలయం వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

క్రమశిక్షణ, అంకిత భావంతో నటునిగా రాణించవచ్చు

- ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు

ప్రజాశక్తి -కల్చరల్



క్రమ శిక్షణ అంకిత భావం దీక్ష తో నటునిగానే కాక ఏ రంగంలో నైనా రాణించ వచ్చని ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు అట్టి వ్యక్తిత్వంతో ఉన్నత స్థాయి గతంలో శోభన్ బాబు అందుకున్నారని అయన మార్గంలో కౌశిక్ ఎదుగ తున్నారని అయన పేర్కొన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా) నిర్వహణలో అలనాటి ప్రముఖ నటుడు శోభన్ బాబు 89వ జన్మదిన సందర్భంలో బుల్లితెర ప్రముఖ నటుడు కౌశిక్ కు శోభన్ బాబు స్మారక పురస్కారం ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రేలంగి నరసింహారావు శోభన్‌బాబు వంశీ గ్లోబల్ అవార్డ్ పురస్కారం బహుకరించి మాట్లాడారు. బుల్లి తెర మెగా స్టార్ కౌశిక్ తాను తీసిన సినిమాలలో నటించారు అని గుర్తుచేశారు. తండ్రి నటుడు శంకర్ సోదరుడు నటుడు బాలాదిత్య ఇతర కుటుంబ సభ్యులు కౌశిక్ సన్మాన కార్యక్రమంలో పాల్గొనడం సమిష్టి కుటుంబ సౌందర్యానికి ప్రతీక అన్నారు. శోభన్ బాబు మరణించి పదిహేను ఏళ్లపై బడినా ఇంకా ఆయనకు ఎంతో మంది అభిమానులు వున్నారని రెండు తెలుగు రాష్ట్రాలులో అయన జయంతిని ఘనంగా జరుపుకొనడం విశేషం అన్నారు. అధ్యక్షత వహించిన వంశీ రామరాజు మాట్లాడుతూ వంశీ సంస్థను శోభన్ బాబు ఏభై ఏళ్ల పూర్వం ప్రారంభించారు అని గుర్తు చేసుకున్నారు. పురస్కార గ్రహీత కౌశిక్ మాట్లాడుతూ రెండు సార్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నంది అవార్డు అందుకున్న తనకు శోభన్ బాబు వంశీ అవార్డును అందుకున్నందుకు ఆనందంగా ఉంది అన్నారు.వేదిక పై నటులు శంకర్ బాలా దిత్య తదితరులు పాల్గొన్నారు. తొలుత వైఎస్ రామకృష్ణ అమెరికా నివాసి వెంకట్ , వీణ, లలిత, అఖిల, అనిత స్వర కల్యాణి తదితరులతో కలిసి పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. సుధా మయి వ్యాఖ్యానం చేయగా సుంకర పల్లి శైలజ కార్యక్రమ నిర్వహణ చేశారు.

మీ వ్యాఖ్యలు అభ్యంతరకరం

- ఎంపి అరవింద్‌కు మంత్రి తుమ్మల లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకటించిన సందర్భంగా ఎంపి అరవింద్ తనపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆ వ్యాఖ్యల పట్ల అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ ఆయనకు మంత్రి లేఖ రాశారు. తన రాజకీయ జీవితం గురించి మీరు చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని తెలిపారు. మీరు ఆ స్థాయికి దిగజారి మాట్లాడతారని తాను ఊహించలేదని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానం పట్ల అవగాహన రాహిత్యమో, సమాచార లోపమో తెలియదు కానీ ఆ వ్యాఖ్యలు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. మొదటి సారి ఎన్నికల్లో మీరు నిలబడినప్పుడు పసుపు బోర్డు ఏర్పాటు చేయిస్తానంటూ మీరు ప్రజలకు రాసిచ్చిన బాండ్ పేపర్ గురించి నేనెక్కడా ప్రస్తావించలేదని పేర్కొన్నారు. ఎందుకంటే అప్పుడు తాను నిర్వహిస్తున్న మంత్రిత్వ శాఖకు తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. రెండు పర్యాయాలు లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైన మీరు ఇంతటి అధమ భాషను వాడటం సభ్యత అనిపించుకోదని గుర్తు చేశారు. పరిపక్వతలేని మాటలు మాట్లాడకుండా, కొద్దిగా సహనం, రాజకీయ పరిజ్ఞానంతో మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రజా పోరాటాలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. జనవరి 25వ తేదీ నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో జరగనున్న సిపిఎం రాష్ట్ర 4వ మహాసభ పోస్టర్లను బుధవారం నల్లగొండ పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమాల దిక్సూచి, పోరాటాల సారధి, కష్టజీవుల గొంతుక సిపిఎం అని చెప్పారు. 25న ప్రజాప్రదర్శన, బహిరంగ సభ సంగారెడ్డిలోని పీఎస్‌ఆర్ గ్రౌండ్స్‌లో ఉంటుందని, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఎక్కడ ప్రజలు సమస్యలతో ఇబ్బంది పడితే అక్కడ పోరు కెరటం ఎగరేసేది సిపిఎం అని చెప్పారు. తెలంగాణ ఏర్పడి దశాబ్ద కాలం గడిచినా ప్రజల సమస్యలు మాత్రం తీరలేదన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, జిల్లాలో డిండి ఎత్తిపోతలు, నక్కలపల్లి గండి, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టులను పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌ను తిరస్కరించి కాంగ్రెస్‌ను గెలిపిస్తే.. ప్రభుత్వం మారింది తప్ప ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. పేదలు తలదాచుకోడానికి జానెడు జాగా లేక అల్లాడిపోతున్నారని,



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జూలకంటి రంగారెడ్డి

వారికి ఇండ్ల స్థలాల కోసం సిపిఎం నిరంతరం పోరాటాలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ భూములను పేదలకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లగచర్లలో సిపిఎం ప్రజల పక్షాన నిలిచి విజయం సాధించినట్టు చెప్పారు. డిండి ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

మూసీ ఆయకట్టు సుమారు 70 వేల నుంచి లక్ష ఎకరాలు ఉంటుందని, మూసీలో మురికిని తలించి మంచినీరులా మారుస్తామన్న ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తున్నట్టు చెప్పారు. గోదావరి, కృష్ణా జలాలతో మూసీ నదిని అనుసంధానం చేయాలని కోరారు. అలాగే, అర్హులైన పేదలకు వెంటనే డబుల్ బెడ్ రూమ్స్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ సర్కార్ నూతన ఆర్థిక విధానాలను, నయా ఉదారవాద విధానాలను చాలా వేగవంతంగా అమలు చేస్తూ కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు దోచి పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హాషం, పాలడుగు నాగార్జున, వి.వెంకటేశ్వర్లు, నాయకులు గంజి మురళి, దండంపల్లి సత్తయ్య పాల్గొన్నారు.

2న ప్రొఫెసర్ కాకర్ల జాతీయ సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) ఫౌండర్ డైరెక్టర్ పద్మశ్రీ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు శత జయంతి సందర్భంగా ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లో ప్రొఫెసర్ కాకర్ల జాతీయ సదస్సు జరగనున్నది. ఈ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి, డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, రేడియో డయాగ్నోసిస్ విభాగపు అధిపతి డాక్టర్ అనుకపూర్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సదస్సుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నగరంలోని షేక్‌పేటలో గల క్రెస్ట్ ఆడిటోరియంలో ఒక రోజు రేడియాలజీ జాతీయ సదస్సును సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ తెలంగాణ శాఖ, నిమ్స్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సదస్సులో దేశంలోని రేడియాలజీ విభాగపు వైద్యులు, సాంకేతిక నిపుణులు, విద్యార్థులు పాల్గొననున్నారు. సదస్సులో ప్రముఖ డాక్టర్లు జె. జగన్ మోహన్ రెడ్డి, విజయానంద్ ఎచ్ కేల్కరి, రామకృష్ణ, రావూరి పవర్, పన్నీర్ సెల్వం, గడ్డం గంగాధర్, అర్జున్ మంజే గౌడ, సుజాత పట్నాయక్ వివిధ అంశాలపై ఉపన్యాసాలు ఇవ్వనున్నారు. అంతే కాకుండా వివిధ రాష్ట్రాల నుండి రేడియాలజీ విద్యార్థులు వేరు వేరు అంశాలలో పరిశోధన పత్రాలు సమర్పించనున్నారు. ఉత్తమ పరిశోధన పత్రానికి ప్రొఫెసర్ కాకర్ల ఉత్తమ శాస్త్రీయ పత్రం పేరిట నగదు బహుమతి, మెమెంటోతో సత్కరిస్తారు. ఈ సందర్భంగా రేడియాలజీ విభాగంలో ఉత్తమ సేవలు అందించిన రేడియోగ్రాఫర్‌కి డాక్టర్ కాకర్ల జీవన సాఫల్య అవార్డు బహూకరించనున్నారు.ఈ సదస్సులో దాదాపు నాలుగు వందల మంది సాంకేతిక నిపుణులు, విద్యార్థులు పాల్గొన నున్నారు. ఈ సంవత్సరం ఈ అవార్డును ముంబాయిలోని టాటా మెమోరియల్ ఆసుపత్రి టెక్నికల్ ఆఫీసర్, మహారాష్ట్ర వైద్య అనుబంధ వృత్తి మండలి సభ్యులు, సొసైటీ ఆఫ్ ఇండియన్ రీడియోగ్రాఫర్స్ జాతీయ సమన్వయకర్త శంకర్ కె.భగత్‌కు ప్రధానం చేయనున్నారు. ఈ అవార్డులను గత 15 సంవత్సరాలుగా దేశంలో క్రమం తప్పకుండా ప్రధానం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ వైద్య అనుబంధ వృత్తి కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్, సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ అకడమిక్ డైరెక్టర్, కార్యక్రమం చైర్‌పర్సన్ దామోదర నాయుడు పాల్గొన్నారు.

నుమాయిష్‌కు సంక్రాంతి జోష్

- భారీగా తరలివస్తున్న సందర్శకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)కు సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. సంక్రాంతి వరుస సెలవులు రావడంతో నుమాయిష్‌ను రోజూ 60వేల మంది తిలకిస్తున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎంతో పేరెన్నికగన్న పలు రకాల చీరలు, పంజాబీ, చుడీదార్‌లు, గృహోపకరణాలు, డ్రై ఫ్రూట్స్, పిల్లల ఆట వస్తువులు, ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన ప్లే జోన్ ఇలా ఎన్నో రకాల స్టాళ్లు నుమాయిష్‌లో ఆకర్షణగా నిలుస్తున్నాయి. దాదాపు రెండు వేల స్టాళ్లు ఏర్పాటు చేశారు. జమ్మూకశ్మీర్, రాజస్థాన్, ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్‌తో పాటు తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 15 వరకు నుమాయిష్ కొనసాగనుంది.

ప్రత్యేక పోలీసు బందోబస్తు...

ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. రోజూ ముగ్గురు ఎసిపిలు, తొమ్మిది మంది ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, బాంబు స్క్వాడ్ బృందాలు బందోబస్తు నిర్వహిస్తున్నాయి. నుమాయిష్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి సిసిటివి కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ పరిశీలిస్తున్నారు. దొంగలు, ఆకతాయిలు చెలరేగే అవకాశం ఉండటంతో మఫ్టీలో పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. పదికి పైగా షీటీమ్స్ బృందాలను మహిళల భద్రత కోసం కేటాయించామని షీటీమ్స్ డిసిపి లావణ్య జాదవ్‌నాయక్ తెలిపారు.

మాంజా తగిలి కానిస్టేబుల్ మెడకు గాయం

- గొంతు భాగంలో ఐదు కుట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాంజా మెడకు తగిలి ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్ నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బుధవారం నారాయణగూడ సిఐ యు చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. తిలక్‌నగర్ అంబర్‌పేట్ ప్రాంతానికి చెందిన ఏర్పుల శివరాజ్ లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. మంగళవారం విధులు నిర్వహించి తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో నారాయణగూడ ఫ్లై ఓవర్‌పై ప్రమాదకర మాంజా(పతంగి దారం) శివరాజ్ మెడకు తగిలింది. దాంతో అతని మెడ మధ్య భాగంలో గొంతు దగ్గర చర్మం తెగి తీవ్ర రక్తస్రావమైంది. అక్కడున్న వారు వెంటనే అతన్ని తిలక్‌నగర్‌లోని అభయ హాస్పిటల్‌కు తరలించారు. డాక్టర్లు చికిత్స చేసి గొంతు భాగంలో ఐదు కుట్లు వేశారు. ఈ విషయంపై చట్టరీత్యా చర్యలు తీసుకుని, తనకు తగిన న్యాయం చేయాలని బాధితుడు పోలీసులను, ప్రభుత్వాన్ని కోరారు. కేసు దర్యాప్తు చేపట్టినట్టు సిఐ తెలిపారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చంద్రశేఖర్ గౌడ్

రహదారి భద్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత

- మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు
- జెటిసి మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రహదారి ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపైనా ఉందని రవాణా శాఖ జాయింట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జెటిసి మాట్లాడుతూ.. 75 శాతం రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, మిగిలిన 25శాతం వాహన, రోడ్డు కండిషన్ బాగా లేకపోవడం వల్ల జరుగుతున్నాయని తెలిపారు. పరిమితికి మించిన వేగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ముఖ్యంగా యువత ఈ రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణం కోల్పోతుండటం ఆందోళన కలిగిస్తున్న అంశమన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా కమిషనర్ సురేంద్ర మోహన్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దాంతోపాటు తనిఖీలు చేపడుతున్నామన్నారు. త్రైమాసిక పన్ను చెల్లించని వాహనదారులు జనవరి 30 లోపల చెల్లించాలన్నారు. లేనిపక్షంలో భారీ జరిమానాతోపాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. రవాణా శాఖ జిల్లా అధికారి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామన్నారు. ఆర్మూర్ మోటారు వాహన తనిఖీ అధికారి వివేకానంద రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని, ప్రతి వాహనం ఫిట్‌నెస్ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంవిఐలు రాహుల్ కుమార్, కిరణ్ కుమార్, ఎఒ ప్రహ్లద్, ఎఎంవిఐలు శ్రీనివాస్, సాగర్, పవన్ కళ్యాణ్, వివిధ వాహనాల డ్రైవర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

పసుపు రైతులకు సబ్సిడీలో పనిముట్లు ఇవ్వండి

- మంత్రి తుమ్మలకు కోదండరెడ్డి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పసుపు రైతులకు యాంత్రీకరణలో భాగంగా సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను ఇవ్వాలని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం కోదండరెడ్డి కోరారు. ఈమేరకు బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆయన లేఖ రాశారు. ఇటీవల పసుపు రైతుల సమస్యలు తెలుసుకునేందుకు నిజామాబాద్ వెళ్లినప్పుడు, పలు విషయాలు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. పసుపు రైతులకు యాంత్రీకరణ లేకపోవడం వల్ల పండిన పసుపును భూమిలో నుంచి తీయడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. మొక్క నుంచి పసుపు వేరు చేసిన తర్వాత పసుపు ఆరబోయడానికి కల్లాలు లేవని తెలిపారు. పసుపును బెయిల్ చేసేందుకు సరైన యంత్రాలు లేకపోవడంతో పాత పద్ధతుల్లోనే కట్టెలతో మంటపెట్టి పసుపును మరగబెడుతున్నారని గుర్తు చేశారు. అంతేగాక పసుపుకు తగినంత మోతాదుల్లో పాలిష్ వేయలేకపోతున్నారని తెలిపారు. కూలీల కొరత బాగా ఉందని తెలిపారు. అధునాతన యంత్రాలు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో పసుపు విత్తన పరిశోధన కోసం 40 ఎకరాల భూమి కేటాయించిందని గుర్తు చేశారు. ఆ కాలంలోనే నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయమని కేంద్రాన్ని కోరిందని తెలిపారు. ఈ నేపథ్యంలో పసుపు పండించే రైతులకు యాంత్రీకరణలో భాగంగా పనిముట్లను రాయితీపై అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



తుపాకులను పరిశీలిస్తున్న రాచకొండ పోలీసులు

తుపాకులు విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్ట్

- రెండు తుపాకులు, తపంచా, 10 బుల్లెట్స్
- స్వాధీనం చేసుకున్న రాచకొండ పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో తుపాకులను విక్రయించేందుకు ప్రయత్నించిన నిందితుడిని భువనగిరి జోన్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రెండు తుపాకులు, తపంచా, పది బుల్లెట్స్ (రౌండ్స్)తోపాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాచకొండ సిపి సుధీర్‌బాబు ఎస్‌ఒటి డిసిపి రమణారెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన హరికృష్ణ యాదవ్ 2019లో తన తమ్ముడు మురళితో కలిసి ఉపాధి కోసమని బీబీనగర్‌కు వచ్చాడు. ఓ కంపెనీలో పనిచేశాడు. అయితే, వచ్చే వేతనం సరిపోకపోవడంతో తిరిగి 2022లో స్వగ్రామానికి వెళ్లిపోయాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తుపాకులు విక్రయించి సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో తుపాకులు విక్రయించే కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన సంపత్ యాదవ్‌ను కలిశాడు. అతని వద్ద తపంచా, కంట్రీమేడ్ తుపాకులు, బుల్లెట్స్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేశాడు. వాటిని గుట్టచప్పుడు కాకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌వోటీ బృంద సభ్యులు జవహర్‌నగర్ పోలీసులతో కలిసి హరికృష్ణను అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న సంపత్ యాదవ్ కోసం గాలిస్తున్నారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ ఎన్.నర్సింహారెడ్డి, ఏసీపీ వి.శ్రీకాంత్ గౌడ్, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, ఎస్.సైదయ్య, బి.పరమేశ్వర్, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళపై సామూహిక లైంగికదాడి

- నిందితుల అరెస్ట్
- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిఐ వెంకట్ రాజాగౌడ్

మతిస్థిమితం లేని మహిళపై ముగ్గురు దుండగులు సామూహిక లైంగికదాడి చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు రామాయంపేట సిఐ వెంకట్ రాజాగౌడ్ తెలిపారు. చేగుంట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను తెలియజేశారు. జనవరి 8వ తేదీన మెదక్ జిల్లా మాసాయిపేట మండలం రామంతాపూర్ హంస ఫ్యామిలీ రెస్టారెంట్ పక్కనగల అంబేద్కర్ విగ్రహం వెనకాల మతిస్థిమితం లేని ఒక మహిళపై ముగ్గురు వ్యక్తులు సామూహిక లైంగిక దాడి చేశారు. రామంతాపూర్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి సంబంధించి గేదెలు కనపడకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో 44వ జాతీయ రహదారిపై హంస ఫ్యామిలీ రెస్టారెంట్‌లోని సిసి ఫుటేజ్‌ను పరిశీలించగా, మతిస్థిమితం లేని మహిళపై లైంగికదాడి ఘటన బయటపడింది. చేగుంట మండల కేంద్రం నుంచి కోళ్లను సరఫరా చేసే వాహనం మీద పనిచేసే డ్రైవర్, హెల్పర్లు ఈ దారుణానికి ఒడిగట్టినట్టు పోలీసులు గుర్తించారు. నిందితులు తూప్రాన్ పట్టణానికి చెందిన సయ్యద్ అఫ్రోజ్, చేగుంట పట్టణానికి చెందిన గౌర బసవరాజ్, బీహార్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ సాహిల్‌ను ఈ నెల 13న అరెస్టు చేసి మెదక్ కోర్టులో ప్రవేశపెట్టి.. అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, ఇతర పోలీసులు పాల్గొన్నారు.

తీర్థయాత్రలకు వెళ్లిన బస్సుకు అగ్ని ప్రమాదం

- వృద్ధుడి సజీవ దహనం
- ఉత్తరప్రదేశ్ బృందావన్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తీర్థ యాత్రలకు వెళ్లిన బస్సు అగ్నిప్రమాదానికి గురైంది. దాంతో ఓ వృద్ధుడు సజీవ దహనమయ్యాడు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలం పల్సి గ్రామానికి చెందిన సిలెం దురుపతి (63) బస్సులోనే సజీవ దహనమయ్యాడు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరిగింది. ముధోల్ నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన దాదాపు 50 మంది ఈ నెల 1న తీర్థయాత్రలకు బయలుదేరి వెళ్లారు. బృందావన్ క్షేత్ర సందర్శనకు వెళ్లారు. అనారోగ్య కారణాలతో దురుపతి బస్సులోనే కూర్చోగా.. అతని భార్య మిగతా యాత్రికులతో కలిసి దర్శనానికి వెళ్లింది. దర్శనం చేసుకొని తిరిగి వచ్చే సరికి బస్సు దగ్ధమైంది. ఈ ఘటనలో సిలెం దురుపతి సజీవ దహనమయ్యాడు. ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. బస్సుతో పాటు యాత్రికుల సామాగ్రి, దుస్తులు, నగదు ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. వారంతా కట్టుబట్టలతో మిగిలారు. అక్కడి పోలీసులు, స్థానికులు వారికి వసతులు కల్పించి యాత్రికులను సురక్షితంగా భైంసాకు తరలించే చర్యలు చేపట్టారు. బస్సు ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే రామారావ్ పటేల్ బృందావన్ క్షేత్ర కలెక్టర్, ఎస్‌పితో ఫోన్‌లో



మాట్లాడి యాత్రికుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. వారిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు చర్యలు తీసుంటున్నారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దృష్టికి సైతం తీసుకెళ్లినట్టు తెలిసింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ అక్కడి అధికారులతో మాట్లాడి యాత్రికుల తరలింపుకు చర్యలు తీసుకోవాలని సూచించినట్టుగా తెలిసింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రెండు మినీ బస్సులు ఏర్పాటు చేసి యాత్రికులను సొంతూరు తరలించడానికి ఏర్పాటు చేసింది. అక్కడి వ్యాపార సముదాయాల యజమానులు బట్టలు, దుప్పట్లు అందించారని, ట్రస్టు, ప్రభుత్వం తరపున ఆహారం అందించారని యాత్రికులు తెలిపారు. వారంతా బుధవారం ఉదయం 11 గంటలకు బృందావన్ క్షేత్రం నుంచి భైంసాకు తిరుగు పయనమయ్యారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ యాత్రికుల స్థితిగతులపై ఎప్పటికప్పుడూ ఆరా తీస్తున్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ సరే... ట్రాన్స్‌పరెన్సీ ఏదీ?

- మంత్రివర్గంలో ఆమోదం పొందినట్టు ఆలస్యంగా మీడియాకు సమాచారం
- అనుకూల అంశాలతో లీకులు ఇచ్చిన సిఎంఒ
- జెన్‌కో భాగస్వామ్యంపై స్పష్టత కరువు
- రూ.1.98 లక్షల కోట్ల ప్రయివేటు పెట్టుబడుల వైపే సర్కారు మొగ్గు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025ను ఈనెల 4వ తేదీ జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదం పొందినట్టు ముఖ్యమంత్రి కార్యాలయం ఆదివారం కొన్ని పత్రికలకు లీకులు ఇచ్చింది. ఈ పాలసీ ద్వారా 2030 నాటికి 20వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధనోత్పత్తి కోసం రూ.1.98 లక్షల కోట్ల ప్రయివేటు పెట్టుబడులు పెట్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు పేర్కొన్నారు. ఈనెల 3వ తేదీ ఇదే పాలసీపై హెచ్ఐసిసిలో డిప్యూటీ సిఎం, ఆర్థిక, విద్యుత్‌శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క దేశవ్యాప్తంగా స్టేక్ హోల్డర్ల సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో ఏ మాటలైతే చెప్పారో, ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయం ఇచ్చిన లీకుల్లో కూడా అవే ఉన్నాయి. పాలసీని మంత్రివర్గం ఆమోదించాక, దానిలోని అంశాలను దాచి ఉంచాల్సిన అవసరం ఏముందనేదానిపై విద్యుత్‌రంగంలో చర్చనీయాంశంగా మారింది. ఆ పాలసీలో ఎక్కడా జెన్‌కోకు ప్రాధాన్యత లేకపోవడం, పూర్తిగా ప్రయివేటుకే అవకాశాలు కల్పిస్తూ, భారీ ఎత్తున రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటించడమే ఈ గోప్యతకు ప్రధాన కారణమని తెలిసింది. పునరుత్పాదక ఇంధనంలో జెన్‌కోలో ఇప్పటి వరకు కేవలం రెండు మెగావాట్లు మాత్రమే ఉండటం గమనార్హం. ఈనెల 3వ తేదీ జరిగిన విలేకరుల సమావేశంలో జెన్‌కో ప్రాధాన్యత గురించి విద్యుత్‌శాఖ మంత్రిని అడిగినప్పుడు ఆయన అస్పష్టంగా సమాధానాలు చెప్పి లేచివెళ్లిపోయారు. దానికి తోడు రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ప్రయివేటు వ్యక్తులు, సంస్థలతో జాయింట్ వెంచర్లకు కూడా అవకాశం కల్పిస్తామని మంత్రి చెప్పారు. దీనికి సంబంధించిన విధివిధానాలు ఏంటో తెలీదు. తెలంగాణలో పునరుత్పాదక ఇంధనం కోసం ఇచ్చే భూముల్ని వ్యవసాయేతర భూములుగా పరిగణిస్తామని ముఖ్యమంత్రి కార్యాలయం ఇచ్చిన లీక్‌లో పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్ర రైతాంగం అనేక సమస్యల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ పాలసీ అమల్లోకి వస్తే 1.14 లక్షల కొత్త ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెట్రో రైలు విస్తరణ, ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఫార్మాసిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, పారిశ్రామిక కారిడార్ తదితర అభివృద్ధి పనులతో భవిష్యత్తులో విద్యుత్తు డిమాండ్ భారీగా పెరగనుందని అంచనా వేశారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. రాష్ట్రంలో 2024-25లో 15,623 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ఉండగా, 2034-35 నాటికి 31,809 మెగావాట్లకు పెరుగుతుందని అంచనా ఉందని తెలిపారు. అందువల్ల సౌర విద్యుత్‌తో పాటు ఫ్లోటింగ్ సోలార్, విండ్ పవర్, గ్రీన్ హైడ్రోజన్, హైబ్రిడ్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు ఈ విధానాన్ని రూపొందించామని పేర్కొన్నారు. అయితే దీనికోసం ఆ విధానంలో ఏఏ అంశాలు ఉన్నాయనే వివరణ మాత్రం ఇవ్వలేదు. మరోవైపు గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు పెట్టుబడులతో వచ్చే పారిశ్రామికవేత్తలకు పన్ను మినహాయింపులతో పాటు సబ్సిడీలు, ఇతర ప్రోత్సాహకాలను ఈ పాలసీలో పొందుపరిచామని తెలిపారు. రాష్ట్రంలోని వాతావరణం ఏడాదిలో 300 రోజులు సౌర విద్యుదుత్పత్తికి అనుకూలిస్తుందనీ, దేశంలోనే బలమైన గాలులు వీచే ఎనిమిది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అనీ, అందువల్ల పవన విద్యుదుత్పత్తికి మెండుగా అవకాశాలున్నాయని పేర్కొన్నారు. కొత్త విధానం ప్రకారం సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్లు, పవన విద్యుత్ కేంద్రాలను స్థాపించేందుకు ముందుకు వచ్చే డెవెలపర్లను ప్రోత్సహిస్తామనీ, దానికోసం ప్రయివేటు, ప్రభుత్వ స్థలాల్లో కొత్త ప్లాంట్లకు అనుమతులిస్తామని వివరించారు. వీటికి ప్రభుత్వ స్థలాలను నామమాత్రపు అద్దెతో ప్రభుత్వమే లీజుకు ఇస్తుందని తెలిపారు. అలాగే ఈ పాలసీ ద్వారా రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్నవారు డిస్కంలకు లేదా ప్రయివేటు సంస్థలకు ఓపెన్ యాక్సెస్ ద్వారా కరెంటును అమ్ముకునే అవకాశాన్ని కల్పించామని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. ఈ పాలసీలో పునరుత్పాదక ఇంధనోత్పత్తిలో ఎక్కడా జెన్‌కో ప్రస్తావన లేకపోవడం గమనార్హం. ఈ రాయితీలన్నీ జెన్‌కు కూడా వర్తిస్తాయా లేదా అనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.

హామీల అమలును ప్రశ్నిస్తే కేసులా?

- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని అడగుతున్నందుకే తనపై అక్రమ కేసులు పెట్టి వేదిస్తున్నారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముగ్గురు మంత్రుల సాక్షిగా కరీంనగర్ సమీక్షా సమావేశంలో తనపై జగిత్యాల ఎమ్మెల్యే దాడి చేశారని ఆరోపించారు. 'రైతు రుణమాఫీ జరగలేదని కరీంనగర్ సమీక్ష సమావేశంలో ప్రశ్నించాను. అ సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాపైన రన్నింగ్ కామెంట్స్ చేశారు. మా పార్టీ ఎమ్మెల్యే సంజయ్‌ను నువు ఏ పార్టీ నుంచి గెలిచావని అడిగాను. దాంతో అతనే తనపై దాడికి తెగబడ్డాడు. వాస్తవం ఇలా ఉంటే తనపై తప్పుడు ఆరోపణలు చేసి కేసులు బనాయించారు. వెంటనే తనపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి" అని డిమాండ్ చేశారు. కేసీఆర్ లేకపోతే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వార్డ్ మెంబర్ కూడ గెలవలేడని వ్యాఖ్యానించారు. ఆ విషయం మరిచి అతిగా ప్రవరిస్తున్నాడని విమర్శించారు. తనపై అనర్హత వేటుకు స్పీకర్‌కు ఫిర్యాదు చేయడాన్ని తప్పు పట్టారు. హుజురాబాద్ ప్రజలు గుండెల్లో పెట్టుకొని గెలిపించిన తనను ఎందుకు డిస్క్వాలీఫై చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రశ్నిస్తున్న తనపై ఇప్పటివరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 28 కేసులు పెట్టిందని గుర్తు చేశారు. ఎన్ని కేసులు పెట్టినా ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటానని స్పష్టం చేశారు.